క్లుప్తంగా

ఘనంగా జువ్వమాంబ అమ్మవారి పరస



భక్తుల పూజలందుకుంటున్న జువ్వాలమ్మ అమ్మవారు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువాని పాలెం జువ్వమాంబ ఆలయం పరస మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని పసుపు కుంకుమలతో పూజలు చేశారు. కొందరు భక్తులు అమ్మవారికి గాజులు, చీరలు సమర్పించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస నిర్వహించారు.

సంజీవయ్యనగర్‌లో జియ్యాని పర్యటన



సంజీవయ్యనగర్‌లో గెడ్డను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్యనగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. ఈ ప్రాంతంలో పలు సమస్యలను ఆయన పరిశీలించారు. ఇక్కడి గెడ్డలో పూడికలు పేరుకుపోతున్నాయని దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. దీనిపై 52వ వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తితో వెంటనే పూడికలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని.. అందుకు తగిన ప్రణాళికలు తయారు చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ ఏఈ ఉషకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ గణేష్, వెదుళ్ల శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగబిల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ నేడు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులోని గొల్లపేటలో నూతనంగా నిర్మించిన నర్సింగబిల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయం ప్రత్యేకంగా ముస్తాబయింది. అమ్మవారి ప్రతిష్ఠా సంకల్పం, విఘ్నేశ్వర పూజ, యాగాలు, దీపారాధన, అంకురారోహణ, జలాధివాసం, క్షీరాధివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు. 26 ఉదయం 9.45 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అనంతరం చండీ హోమం, జయాధి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఏర్పాట్లను ఆలయ నిర్మాణ దాత కేవీబాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తున్నారు.

స్కేటింగ్ విజేతలకు అభినందన

మద్దిలపాలెం: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన పొందల సహిర, పి.సమీక్ష బంగారు, రజత, పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలకు మద్దిలపాలెంలోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో బుధవారం సభ్యుడు గొండు సీతారాం అభినందించారు. 2014 నుంచి సహీరా జిల్లా, జాతీయ స్థాయిలో పాల్గొని ఇప్పటి వరకూ 61 బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించడం అభినందనీయన్నారు. సమీక్ష కూడా 2016 నుంచి జిల్లా, జాతీయ స్థాయి పోటీల్లో 57 పతకాలు సాధించిందన్నారు. ఈ స్ఫూర్తి కొనసాగించాలన్నారు.

బ్రిడ్జి సుందరీకరణకు కృషి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పరిశీలన
- అతికించిన పోస్టర్లు తొలగించాలని ఆదేశం



ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అతికించిన పోస్టర్లను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ సుందరీకరణకు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఈ బ్రిడ్జి విశాఖకు వచ్చేవారికి స్వాగతం పలుకుతుందన్నారు. బుధవారం సాక్షిలో 'తొలగిస్తున్నా.. అతికించేస్తున్నారు' శీర్షికతో వచ్చిన వార్తకు స్పందిస్తూ ఆయన ప్రత్యేకంగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయానికి చేరువగా ఉండే ఈ బ్రిడ్జి నగరానికి తలమానికమన్నారు. దీన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాల్సి ఉందని తెలిపారు. దీనిపై కమిషనర్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందిస్తానని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్వహణ సరిగా లేదన్నారు. పోస్టర్లు అతికించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు శానటరీ, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించామని తెలిపారు. బ్రిడ్జి పిల్లర్లు, గోడలపై అతికించిన పోస్టర్లను తొలగించాలని ఆదేశించారు.

అధికారులతో మరో మారు పర్యటిస్తా...

అవసరమైతే అధికారులతో మరో మారు బ్రిడ్జి ప్రాంతంలో పర్యటిస్తానని తెలిపారు. సాంప్రదాయ రంగులు వేసేందుకు.. సుందరీకరణ పనులు ఏ విధంగా చేయొచ్చో అంచనా వేసేందుకు అధికారులతో పర్యటన ఏర్పాటు చేస్తానని తెలిపారు. పోస్టర్లు అతికించకుండా ఉండేందుకు కఠిన చర్యలు అవసరమన్నారు. గతంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో పలు చోట్ల వివిధ రకాల బొమ్మలు చిత్రించామని.. అవి ఇప్పటికీ ఉంతో అందంగా ఉన్నాయన్నారు. బ్రిడ్జిని కూడా అదే స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు.

ఆదర్శ నాయకత్వంతో దేశాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న 61వ వార్డు కార్పొరేటర్ సుధ



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: ఆదర్శ నాయకులను ఎన్నుకున్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో 'ఓటు హక్కు వల్ల ప్రయోజనాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా యువత ఓటు వినియోగించాలన్నారు. పాలనలో అతనికి ఉన్న అనుభవం, ప్రజలతో అతను గడిపిన క్షణాలు,సమాజానికి చేసిన మేలు ఇలా పలు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

- 61వ వార్డు పరిధి మల్కాపురంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ యువత చేతిలో దేశ భవిత ఉందని, ఆ యువత తమ ఓటు హక్కును మంచి పాలన అందిస్తున్న నాయకత్వాన్ని బలపరిచే విధంగా ఉండాలన్నారు. ఆకర్షణకు లోనై అనుభవం లేని నాయకుడ్ని ఎన్నుకుంటే మూడు గంటల సినిమా మాదిరిగా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు బాధ్యతగా భావించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి, జెడ్సీ

కంచరపాలెం: యువత ఓటు హక్కు నమోదు బాధ్యతగా భావించాలని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యపద్మ పిలుపునిచ్చారు. బుధవారం జ్ఞానాపురం జోన్–5 కార్యాలయం ఆవరణలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్) జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మాట్లాడుతూ ప్రతిపౌరుడు ఓటు హక్కును వినియోగించుకున్ననాడే దేశ భవిష్యత్తును నిర్ణయించవచ్చు అన్నారు. అనంతరం ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డులను జెడ్సీ అందజేశారు. ముందుగా జోనల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గురుమూర్తి, బీఎల్‌వోలు, ఎలక్షన్ సెల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట పాఠశాలలో ఓటర్ ప్రతిజ్ఞ

జీవీఎంసీ కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాలలో విద్యార్థులచే ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు నేతృత్వంలో ఉపాధ్యాయులు ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా బాక్స్



గొల్లవీధి స్తంభం వద్ద మీటర్ దిగువ బాక్స్‌కు తలుపు లేని దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద ఆ ప్రాంత వీధి లైట్లు వెలిగించేందుకు జంక్షన్ బాక్స్, విద్యుత్ మీటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. విద్యుత్ డిజిటల్ మీటర్‌కు రక్షణగా పై కవర్ ఉన్నా దిగువ గల జంక్షన్ బాక్స్ (ఫ్యూజ్ బాక్స్)కు మాత్రం పై కవర్ లేదు. దీంతో ఆ బాక్స్‌లో వెలాడుతున్న వైర్లు పొరపాటున ఎవరికైనా తగిలినా.. ఎవరైనా ముట్టినా ముప్పు తప్పదు. అధికారులు స్పందించి ఫ్యూజ్ బాక్సుకు రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 కల్యాణ వేడుక ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు ఆత్మకూరి రవి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏపీపీఎస్ఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ 2023 డైరీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఏపీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రామకృష్ణ, కార్యదర్శి సీహెచ్ రమేష్, కార్యనిర్వహణ కార్యదర్శి డీవీ శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్, సలహాదారులు ఎం.శ్రీనివాసరావు, పి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

28న సింహగిరిపై రథసప్తమి పూజలు

సింహాచలం: ఈనెల 28న సింహగిరిపై రథసప్తమి పూజలు విశేషంగా నిర్వహించేందుకు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికార, వైదిక వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న రాతిరథంపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి స్నపనం, అరుణపారాయణ పఠనం, విశేష పూజలు నిర్వహిస్తారు. నిత్యకల్యాణం కూడా రాతిరథంపైనే నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఈమేరకు రాతిరథాన్ని ముస్తాబు చేస్తున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సంబంధిత ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.

విశాఖ చేరుకున్న పీసీసీ అధ్యక్షుడు



విమానాశ్రయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

గోపాలపట్నం: పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రిపబ్లిక్‌డే సందర్భంగా నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాహుల్ గాంధీ జోడో భారత్ యాత్ర ఏర్పాట్లపై చర్చించడానికి వచినట్లు నాయకులు తెలిపారు. ఆయనతో పాటు కేవీపీ రామచంద్రరావు వచ్చారు. వీరికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గొంప గోవిందు, సోడదాశి సుధాకర్, వి. శ్రీనివాసరావు, ఎం. సబ్బన్న, తదితరులు స్వాగతం పలికారు.

అప్పన్న సన్నిధిలో ఆప్కో చైర్మన్ చిరంజీవి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గంజి చిరంజీవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు చిరంజీవి వెంట ఉన్నారు.

కుట్టుమిషన్లు, వీల్‌చైర్ అందజేత



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి వరలక్ష్మినగర్‌లో మహిళా మండలి సమకూర్చిన కుట్టుమిషన్లు, వీల్‌చైర్ కార్పొరేటర్ ముమ్మన దేముడు పంపిణీ చేశారు. కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ ఇచ్చారు. వీరిలో నలుగురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అలాగే అనకాపల్లికి చెందిన రాధాకృష్ణ ఆస్పత్రి యాజమాన్యం సమకూర్చిన వీల్‌చైర్‌ను దివ్యాంగుడికి అందజేశారు. కార్యక్రమంలో కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.కె.జోష్, మహిళా మండలి సభ్యులు చాయ, ప్రభ, భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దేవుడుబాబు, గంట్ల నరసింహమూర్తి, అప్పికొండ రాంబాబు, గోపాల్, ప్రభాకర్, నారాయణ పాల్గొన్నారు.

ఎగువ బ్రిడ్జిపై భారీ వాహనాలకే అనుమతి

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజనీర్ పి. శివప్రసాద్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ–2 శరత్‌కుమార్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రోటరీ విధానంలో ఈ బ్రిడ్జి నిర్మించినట్లు తెలిపారు. ఈ నిర్మాణంలో ఎగువ రోటరీ బ్రిడ్జిపై నుంచి లారీలు, బస్సులు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు మాత్రమే వెళ్లాలని తెలిపారు. తేలికపాటి వాహనాలైన కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ల కోసం గ్రౌండ్ లెవెల్లో రోటరీ రోడ్డు నిర్మించామని తెలిపారు. మధ్య రోటరీ పాదచారులకు మాత్రమే అన్నారు. పోలీసులతో వాహనదారులు, పాదచారులు సహకరించాలని కోరారు.

సైకిల్ పైనుంచి పడి బాలుడి మృతి

మల్కాపురం: స్కూల్ నుంచి వచ్చిన బాలుడు సరదాగా సైకిల్ తొక్కుతూ అదుపు తప్పి మృతి చెందాడు. దీంతో బాలుడి బంధువులు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో కాశీ వికాష్(12) అనే బాలుడు తండ్రి గణేష్, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. తండ్రి కోరమాండల్ బస్టాప్ వెనుక గల ప్రధాన మార్గంలో ఉమా జ్యూయలర్స్ (బంగారం షాపు) నడుపుతున్నాడు. జవహర్‌నగర్‌లోని సరస్వతీ విద్యా విహార్ పాఠశాలలో వికాష్ 8వ తరగతి చదువుతున్నాడు. అయితే బుధవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన వికాష్ సైకిల్ తీశాడు. సాయిబాబా ఆలయానికి ఆనుకుని ఉన్న సర్వీసురోడ్డులో సైకిల్ తొక్కుతున్నాడు. ఆ మార్గం బాగా ఎత్తు (అప్)లో ఉండడంతో ఎత్తుకు సైకిల్ తీసుకువెళ్లి, ఆ పల్లం (డౌన్) మార్గంలో సైకిల్‌పై అతి వేగంగా వచ్చాడు. దీంతో సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో వికాష్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్టు అక్కడ వైద్యులు తెలపడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

అనధికార నిర్మాణాల జోరు!



ఎదురవానిపాలెం వద్ద కాలువ దాటి వచ్చిన నిర్మాణం



ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ వద్ద అనధికార నిర్మాణం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల అనధికార నిర్మాణాల జోరుగా సాగుతున్నాయి. వీటిపై స్థానికులు సచివాలయం టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 58వ వార్డు పరిధి కోడిపందాలదిబ్బ,ములగాడ,చిన్నములగాడ,ఎదురవానిపాలెం ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు నెల రోజుల నుంచి సాగుతున్నాయి. తీసుకున్న ప్లానింగ్ ఒక్కటి,అక్కడ జరుగుతున్న నిర్మాణం భిన్నంగా ఉంది. వీరు వీధి కాలువలను కప్పి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కనీసం స్పందించకపోవడంతో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- అలాగే 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ,ములగాడ హౌసింగ్‌కాలనీ,హిమాచల్‌నగర్ ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో జీ ప్లస్ టూ కి ప్లాన్ తీసుకుని సెల్లార్‌లో వాణిజ్య దుకాణాలకు అవసరమైన విధంగా నిర్మాణం జరుపుతున్నాడు. అలాగే హిమాచల్‌నగర్ వద్ద ఎలాంటి ప్లాన్ లేకుండానే బహుళ అంతస్తు నిర్మిస్తున్నారు. ములగాడ హౌసింగ్‌కాలనీలో జీ ప్లస్ వన్‌కు ప్లాన్ తీసుకుని జీ ప్లస్ టూ నిర్మాణం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇక్కడ అంధకారం.. అక్కడ వెలుగు!



మల్కాపురం నుంచి శ్రీహరిపురం వెళ్లే మార్గంలో వాహనాల లైట్లే ..



నేవల్ ఏరియా రోడ్డులో వెలుగుతున్న లైట్లు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని ఓ సర్వీసు రోడ్డులో విద్యుత్ లైట్లు కాంతులీనుతుంటే... సాధారణ ప్రజలు తిరిగే మార్గంలో మాత్రం అంధకారం అలుముకుంది. ఈ పరిస్థితి కొన్ని నెలల నుంచి కొనసాగుతోంది.

ఇదీ పరిస్థితి

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో భాగంగా సింధియా నుంచి ఐవోసీకి వెళ్లే మార్గంలో డివైడర్ తొలగించారు. షిప్‌యార్డ్ నుంచి భారీ వాహనాల సాయంతో రియాక్టర్లు,కోలామ్‌లు తదితర భారీ సామగ్రిని తరలించేందుకు సులువుగా ఉంటుందని తొమ్మిది నెలల కిందట దీన్ని తొలగించారు. దీంతో మధ్యలో గల విద్యుత్ ఎల్‌ఈడీ షో ల్యాంప్స్ తీసేశారు. అలాగే గాజువాక ఆర్టీసీ డిపో నుంచి కోరమాండల్ వరకు రోడ్డు మధ్య డివైడర్‌తో పాటు షో ల్యాంప్స్‌ను అప్పుడే తొలగించారు.అయితే తొలగించిన లైట్ల స్థానంలో రోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు అమర్చాలి. కానీ అలాంటి చర్యలు ఏమీ చేపట్టలేదు. దీంతో ఆయా మార్గాల్లో రాత్రి సమయంలో అంధకారంగా ఉంటుంది. ఈ కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే మాదిరిగా పైపులైన్ దగ్గర నుంచి డాక్‌యార్డ్ పరిధిలో డివైడర్ లేకున్నా ఆ మార్గంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అక్కడ రక్షణ గోడలకు, తాత్కాలికంగా స్తంభాలను వేసి విద్యుత్ షో ల్యాంప్స్ అమర్చారు. నేవల్ అధికారులు తీసుకున్న చర్యల మాదిరిగా జీవీఎంసీ వారు ఎందుకు తీసుకోరు అంటు పారిశ్రామిక ప్రాంతానికి చెదిన పలువురు వాహనదారులు, పాదచారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సచివాలయాలను సందర్శించిన బెహరా



సచివాలయంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: సచివాలయాల పని తీరు, ప్రభుత్వ పథకాల అమలు విధానం పరిశీలించేందుకు 91, 92 వార్డుల పరిధిలోని పలు సచివాలయాలను జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులు వివరాలు తెలుసుకున్నారు. పథకాల మంజూరుకు ఉన్న అభ్యంతరాలపై ఆరా తీశారు. విమర్శలకు తావు లేకుండా ప్రజలకు మేలు చేసే విధంగా పని చేయాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, 89, 90, 91, 92 వార్డుల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిగ్గు తేల్చేందుకే ఉక్కు ప్రజాగర్జన



713వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసినప్పటికీ, రాజ్యాంగ విలువలను మరిచి కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజల డబ్బుతో పెత్తనం చెలాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిగ్గు తేల్చే ప్రయత్నంలో భాగమే ఉక్కు ప్రజాగర్జన సభ అని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 713వ రోజు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ఎస్ఎంఎస్–2 విభాగం నుండి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని, లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే ఉక్కు ప్రజాగర్జన సభకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, అయోధ్యరామ్, గుమ్మడి నరేంద్ర ఇతర కార్మికులు పాల్గొన్నారు.